# ఇరాన్‌పై ఆంక్షలు -మరోసారి వెల్లడైన అమెరికా సామ్రాజ్యవాద అనాగరికత్వం

**ఇరాన్** తన అంతర్జాతీయ ద్రవ్య వనరులను ఉపయోగించుకొని తమ ప్రజలకు కావలసిన అవసరాలను కొనుగోలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఏకగ్రీవంగా ఆదేశాలు జారీచేసింది. 2012-15 నాటి ఒబామా పాలనాకాలంలో ఇరాన్‌పై ఆంక్షలు విధించి, తన ద్రవ్య మారకాన్ని డాలర్లలోనే సాగించాలని ఆ దేశంపై వత్తిడి తెచ్చి, ఆ దేశ ఆర్థికవ్యవస్థను స్థంభింపజేయటంద్వారా, దాని పీకనులిపి చంపాలని ప్రయత్నించారు. అమెరికా అభ్యర్థనపై బ్రస్సెల్స్ స్థావరంగావున్న 'సొసైటీ ఫర్ వరల్డ్ వైడ్ ఇంటర్‌బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్' (ఎస్‌డబ్ల్యుఐఎఫ్‌టి-స్విఫ్ట్) సంస్థ, అంతర్జాతీయ స్థాయిలో ఇరాన్ డాలర్ల నుపయోగించి తన దేశ అవసరాలను కొనుగోళ్ళు చేసే స్థితిని రద్దుచేస్తూ, దానిని బహిష్కరించింది. 2015 నాటి ఆదేశాలను ఏకపక్షంగా తిరిగి పొడిగిస్తూ ఈ సం॥ మే నెలలో ట్రంపు ప్రభుత్వం ఇరాన్‌తో యుద్ధ సన్నాహాలలో భాగంగా ఆ దేశంపై ఆంక్షలను తిరిగి విధించే పథకాలలో వున్నామని స్పష్టంచేసింది.

తన దేశానికి అవసరమైన కీలకమైన సరుకులను ఇరాన్ కొనుగోలు చేయటాన్ని అమెరికా నిరోధించరాదని అంతర్జాతీయ న్యాయస్థానం డిమాండ్ చేసింది. ఇరాన్‌పై 'స్విఫ్ట్' ఆంక్షలను తిరిగి విధించాలన్న శ్వేతసౌధానికి చెందిన జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ వంటి ఉన్నతాధికారుల పిలుపులతోసహా, ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా యుద్ధ ప్రయత్నాలన్నీ అంతర్జాతీయ న్యాయాన్ని ఉల్లంఘించటమేనని న్యాయస్థానం పేర్కొంది.

ఇరాన్ విదేశాంగమంత్రి అంతర్జాతీయ న్యాయస్థాన నిర్ణయాన్ని కొనియాడాడు. అమెరికా విధిస్తున్న ఆంక్షలు 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌పై కక్షకట్టినవిగా, వాటి చట్టవిరుద్ధతను, వాటి అణచివేత స్వభావాన్ని' వెల్లడిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానానికి తన నిర్ణయాలను అమలుచేయించేందుకు అధికారం, యంత్రాంగం లేకపోయినప్పటికీ, ఈ నిర్ణయం వెలువడిన వెంటనే అమెరికా ఉన్నతాధికారులు అంతర్జాతీయ న్యాయస్థానంయొక్క నిర్ణయంతో తాము విభేదిస్తున్నామని స్పష్టంచేశారు.

1979 నాటి విప్లవం నాటి నుండి, ప్రత్యేకించి 2012-15 కాలం నాటి ఆంక్షల విధింపునుండి ఇరాన్‌ను ఏకాకిని చేయటానికి అమెరికా సాగిస్తున్న నిరంతరాయ ప్రయత్నాలు ఇరాన్‌కు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. 2012-2016 మధ్యకాలంలో ఇరాన్‌లో కీలకమైన చమురు, సహజ వాయువుల ఎగుమతులు 900 కోట్ల డాలర్లనుండి 300 కోట్ల డాలర్లకు పడిపోయాయి. దీనితో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. తన దేశానికి అవసరమైన కీలకమైన ఆహారం, మందులు, పారిశ్రామిక అవసరాలను కొనుగోలు చేయలేకపోయింది.

2018 ఫిబ్రవరిలో ఇరాన్‌లో జరిగిన ఆసీమాన్-3705 విమాన ప్రమాదంలో, అందులో ప్రయాణిస్తున్న 65 మంది చనిపోయారు. 1979 నుండి ఇరాన్‌లో జరిగిన విమాన ప్రమాదాల్లో కనీసం 1,985 మంది మరణించారని గార్డియన్ పత్రిక ఈ సందర్భంగా పేర్కొంది. "1979 ఇస్లామిక్ విప్లవానంతర కాలంలో ఇరాన్‌లో అనేక విమాన ప్రమాదాలు జరుగుతూవస్తున్నాయి. దశాబ్దాల కాలంగా పశ్చిమదేశాల ఆంక్షల ఫలితంగా విమానాల విడిభాగాలనో లేదా నూతన విమానాలనో కొనుగోలు చేయలేకపోవటమే దీనికి ప్రధాన కారణమ"ని ఆ పత్రిక వ్యాఖ్యానించింది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు వినాశకరమైన దుష్పరిణామాలకు కారణమయ్యాయి.

గత కొన్ని దశాబ్దాల కాలంగా, 'ఆర్థిక ఆంక్షలు' అనే సాధనాన్ని కీలకమైన విదేశాంగ విధానంగా అమెరికా సామ్రాజ్యవాదం వుపయోగిస్తోంది. తాను ఎంచుకున్న దేశాలలో పాలకులను మార్పు చేయటానికి, లేదా ఆ దేశాలలో అధికారంలోనున్న వారిని బలవంతంగా కూలదోసి, తన ఆధిపత్య విధానానికి అనుకూలంగా మలచుకోవడానికి, వివిధ దేశాలను వేధింపులకు గురిచేస్తోన్న ఈ ప్రయత్నాలు సామాన్య ప్రజానీకానికి అంతులేని కడగండ్లు సృష్టిస్తున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదం ఇరాక్, క్యూబా, గత కాలపు యుగోస్లేవియా మొదలైన దేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించింది. అవి ఆయా దేశాలలో అంతులేని నష్టాలు కలిగించాయి. 1991 గల్ఫ్‌యుద్ధం తర్వాత ఐక్యరాజ్యసమితి ద్వారా ఇరాక్‌పై అమెరికా విధించిన నిషేధాజ్ఞలు, ఇరాక్ దేశపు ఆరోగ్య అవసరాల దిగుమతులను దెబ్బతీశాయి. ఫలితంగా 5 లక్షలమంది చిన్నారులు వైద్య సేవలందక మరణించి వుంటారని అంచనా. 1996లో టెలివిజన్‌లో జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో అమెరికా రక్షణశాఖామంత్రి మెడిలైన్ ఆల్‌బ్రైట్‌ను వైద్యమందక మరణించిన ఈ చిన్నారుల సంఖ్యపై ప్రశ్నించగా ఆయన తమ ఆంక్షలను హేయమైన విధంగా సమర్థించుకున్నాడు. ఏమైనా, అంతర్జాతీయ న్యాయస్థానం వెలువరించిన తాజా నిర్ణయం అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యవాద, అనాగరికత్వాన్ని మరోసారి వెల్లడి చేసింది.

○○○○